

రేషన్ కార్డులకు మోక్షం కలిగేనా?

- ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డులను తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి కుటుంబం నుంచి వేరుపడిన వారి పరిస్థితి అగమ్యగోచరం
- ఏ పథకానికి అర్హత సాధించలేక నానా తంటాలు
- మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించిన ప్రభుత్వం
- నూతన దరఖాస్తులకు మాత్రం ఇంకా మోక్షం లేదని పేదల ఆవేదన
- ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేస్తేనే పథకాలకు అర్హులు

కామారెడ్డి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మంజూరుచేస్తున్న ప్రతీ పథకానికి రేషన్‌కార్డుతో లింక్ పెట్టడంతో పలువురు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దరఖాస్తులు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా కొత్తరేషన్‌కార్డులు లేక పలువురు ప్రభుత్వ గ్యారెంటి పథకాలకు దూరమవుతున్నారు. గత ఐదేళ్లుగా నూతనంగా రేషన్‌కార్డులు మంజూరుకాకపోవడంతో ఉమ్మడి కుటుంబంలో ఉండి వేరుపడిన వారికి కార్డులు లేవు. దీంతో వారంతా రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న గ్యారెంటి పథకాలు అందుకోలేక పోతున్నారు. ఏ పథకానికి దరఖాస్తు పెట్టుకుందామనుకున్న రేషన్‌కార్డు అడగడంతో వారు నానా తంటాలు పడుతున్నారు.

● ఆరు గ్యారెంటీలకు దూరమేనా?


పేదలకు రేషన్‌సరుకులు అందించాలన్న లక్ష్యంతో ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రభుత్వం తీసుకోచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరుగ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టింది. ఆ పథకాలు పొందాలంటే రేషన్‌కార్డు ప్రామాణికమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రజాపంపిణీ బియ్యం అందాలన్నా, పింఛన్ పొందాలన్నా, రుణమాఫీ అమలు కావాలన్నా రేషన్‌కార్డు తప్పనిసరి. రాష్ట్రవ్యాప్తంగా ఐదేళ్లుగా రేషన్ కార్డులు జారీకాలేదు. ఈ కాలంలో పెళ్లయిన జంటలకు రేషన్‌కార్డులు లేవు. ప్రభుత్వ నిబంధనలతో వీరంతా గ్యారెంటీ పథకాలకు దూరవుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి కుటుంబంలో ఉన్న రేషన్‌కార్డులలోనే మార్పులు, చేర్పులకు అనుమతులు ఇచ్చింది. ఉమ్మడి కుటుంబం నుంచి వేరుగా ఉంటున్న వారికి మాత్రం నూతన కార్డులు మంజూరు కావడం లేదు. నూతన దరఖాస్తులను ప్రభుత్వం స్వీకరిస్తేనే ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలకు అర్హులమవుతామని ప్రజల నుంచి అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

● ఖాతాలు మనుగడలో లేకపోతే..

వినియోగదారులు సిలిండర్ ధరను ముందుగా చెల్లించి సిలిండర్‌ను తీసుకుంటే తర్వాత వారి ఖాతాల్లో సబ్సిడీ డబ్బులు జమచేస్తారు. గ్యాస్ వినియోగదారుల్లో రేషన్ కార్డు దారులే అత్యధికులు ఉంటారు. బ్యాంక్ ఖాతాలు సక్రమంగా కొనసాగుతున్న వారికి రాయితీ సొమ్ముజమయ్యే అవకాశం ఉంటుంది. రేషన్‌కార్డుకు అనుసంధానమై ఉన్న ఖాతా వినియోగంలో లేకపోతే తిరిగి పునరుద్ధరణ, కొత్త ఖాతాలకు అనుమతి ఉండడం లేదని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గృహజ్యోతి పథకం కింద రేషన్‌కార్డు దారులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత గృహవిద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. జిల్లాలో 4లక్షలకు పైగా విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో రేషన్‌కార్డులు లేని వారు ఎక్కువమందే ఉండడం గమనార్హం. వీరంతా ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని పొందలేకపో తున్నారు.

● దరఖాస్తులకు మోక్షం కలిగిస్తేనే..

గతంలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ఆ ప్రక్రియ ముందుకు సాగక కార్డులు మంజూరు కాలేదు. ప్రజాపాలనలో భాగంగా అధికారులు దరఖాస్తులు స్వీకరించగా ఇందులో రేషన్‌కార్డులకు లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇటీవల పెళ్లి అయి మరో ఇంటి నుంచి వచ్చిన మహిళతోపాటు వారికి పుట్టిన పిల్లలతో మార్పులు, చేర్పులకు మాత్రమే అవకాశం కల్పించింది. అయితే కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పలు పథకాలకు రేషన్‌కార్డులను ప్రామాణికంగా తీసుకోవడంతో ఒకే ఇంట్లో వేరువేరుగా ఉంటున్న అన్నదమ్ములు, తల్లిదండ్రులు అర్హులుగా కాకుండా పోతున్నామని వాపోతున్నారు. అసలుకే రేషన్ కార్డులు లేనివారు ఐదేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు జారీ కాకపోవడంతో ప్రతీనెల వచ్చే బియ్యంతోపాటు ప్రభుత్వ పథకాలకు దూరవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే నూతన రేషన్‌కార్డుల దరఖాస్తులకు మోక్షం కల్పించాలని ప్రజలుకోరుతున్నారు.





ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డిటౌన్, జూలై22: ప్రజవాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 91 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖలకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం కానిపక్షంలో ఎందుకు కాలేదో వారికి వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీవో చందర్, డీపీవో శ్రీనివాస్‌రావు, సీపీవో రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించాలి

రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం ఇన్‌పుట్ డీలర్‌ల కోసం డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ప్రోగ్రాం పూర్తిచేసిన డీలర్‌లకు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం రైతులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడానికి, రైతులకు మెరుగైన సేవలందించడానికి, పారా ఎక్స్‌టెన్షన్ నిపుణులుగా వ్యవహరించడానికి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ స్వీయ ఆర్థిక వ్యవసాయ డిప్లొమాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారి భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మిగిత డీలర్లు అందరూ దేశి సర్టిఫికెట్ తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పెసిలిటేటర్ నరేంద్రం, సీనియర్ అసిస్టెంట్ శివకుమార్, బీటీఎం నవీన్ పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీని త్వరితగతిన పూర్తిచేయాలి

బ్యాంకులింకేజీ త్వరిత గతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ డీఆర్‌డీఏ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెలలవారిగా అన్నిమండలాల్లో పూర్తిచేయాలని డీఆర్‌డీఏ పీడీచందర్‌నాయక్‌కు సూచించారు. అలాగే మహిళాశక్తిలో భాగంగా గుర్తించిన అన్నిరకాల యాక్టివిటీలు, గ్రౌండింగ్ పూర్తిచేయాలని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ చందర్‌నాయక్, డీపీఎం రమేష్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సీఎంను కలిసిన మాజీ డీసీసీబీ చైర్మన్

బాన్సువాడ, జూలై 22: ఢిల్లీలోని తెలంగాణ ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్, బాన్సువాడ కాంగ్రెస్‌నాయకులు పోచారం భాస్కర్‌రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతిని పురస్కరించుకుని సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రోహన్‌రెడ్డి, అంజనీకుమార్‌యాదవ్‌లతో కలిసి దాశరథి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.



రేవంత్‌రెడ్డితో మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి



సమాచార హక్కు చట్టం గురించి వివరిస్తున్న సలీం

సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన

ఎల్లారెడ్డి, జూలై 22: సమాచార హక్కు చట్టం అనేది ఒక వజ్రాయుధం లాంటిదని సమాచారహక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఎ సలీం అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో సమాచార హక్కు చట్టం 2005పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సమాచార హక్కు చట్టం విద్యాహక్కు చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో జోనల్ ప్రధాన కార్యదర్శి లెగ్గేల రాజు, అయ్యవారి మధుసూధన్, లింగమయ్య, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

మద్నూర్, జూలై22: మూడురోజులుగా మద్నూర్ మండలంలో కురుస్తున్న వర్షాలతో ఆయా గ్రామాల్లోని పాత ఇళ్లు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు కూలిపోతున్నాయి. ఉమ్మడి మద్నూర్ మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి గ్రామంలో ఇల్లు కూలినట్లు బాధితులు తెలిపారు. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. లచ్చన్ గ్రామంలో చందు, సురేష్‌లకు సంబంధించిన ఇల్లు రాత్రి వర్షానికి కూలగా వారు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందేజేశారు. గత మూడు రోజులుగా మండలంలో వర్షాలు కురుస్తున్నాయని, అందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రజలకు సూచించారు.



లచ్చన్‌లో వర్షానికి కూలిన ఇల్లు



- జిల్లాలో 47.2 మి.మి వర్షపాతం నమోదు
- అత్యధికంగా బాన్సువాడలో 97.1 మి.మీ.లు కురిసిన వర్షం
- నిజాంసాగర్, పోచారం ప్రాజెక్ట్‌లకు స్వల్పంగా వస్తున్న వరద
- కళ్యాణి రిజర్వాయర్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

కళ్యాణి ప్రాజెక్టు రెండు గేట్ల ఎత్తివేత

కామారెడ్డి, జూలై22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మోస్తార్ వర్షాలు కురుస్తున్నాయి. గత నాలుగు రోజులుగా ముసురుతో కూడిన వర్షాలు పడుతూనే ఉన్నాయి. సోమవారం వానలు కాస్త తెరుపునిచ్చాయి. గడిచిన 24గంటల్లో జిల్లావ్యాప్తంగా 47.2 మి.మీ.ల వర్షం కురిసింది. అత్యధికంగా బాన్సువాడలో మండలంలో 97.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో గతవారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు చెరువులు, వాగుల్లోకి వరద వచ్చి చేరుతుంది. నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్వల్పంగా వరద వస్తోంది. ప్రాజెక్ట్‌లోకి 785 క్యుసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నిజాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.198 టీఎంసీలో మాత్రమే నీరు నిల్వ ఉంది. పోచారం ప్రాజెక్ట్‌లోకి సైతం 5617 క్యుసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1.820 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.152 టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉంది. కళ్యాణి రిజర్వాయర్ పూర్తిగా నిండడంతో రెండుగేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు.

● బాన్సువాడలో 97.1 మి.మీ.ల వర్షపాతం


జిల్లాలో నాలుగు రోజులుగా ఎడతెరపులేకుండా ముసురు వర్షం కురుస్తూనే ఉంది. ఉంది. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 47.2 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బాన్సువాడలో 97.1 మి.మీ.ల వర్షపాతం నమోదుకాగా అత్యల్పంగా పల్వంచలో 23.6 మి.మీ.ల వర్షం కురిసింది. మద్నూర్‌లో 59.2 మి.మీ., జుక్కల్‌లో 34.8 మి.మీ., పెద్దకొడప్‌గల్‌లో 25.2 మి.మీ., బిచ్కుందలో 47.0 మి.మీ., బీర్కూర్‌లో 60.9మి.మీ., నస్రూల్లబాద్ 71.6, పిట్లంలో 31.0, నిజాంసాగర్‌లో 38.4,నాగిరెడ్డిపేటలో 37.9,ఎల్లారెడ్డిలో 47.2, లింగంపేటలో 42.4, గాంధారిలో 78.7,సదాశివనగర్‌లో 47.7,తాడ్వాయిలో 63.0, రాజంపేటలో 40.4, భిక్కనూరులో 40.4, కామారెడ్డిలో 45.9, రామారెడ్డిలో 41.6, మాచారెడ్డిలో 28.5, దోమకొండలో 26.4, బీబీపేట్‌లో 25.1, డొంగ్లిలో 27.8 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

ఎల్లారెడ్డి: మండలంలోని తిమ్మారెడ్డి శివారుప్రాంతంలో ఉన్న కళ్యాణి ప్రాజెక్టు రెండుగేట్లను ఎత్తి 450 క్యూసెకుల నీటిని మంజీరాలోకి మరో 200 క్యూసెకుల నీటిని ప్రధాన కాలువ ఆయకట్టుకు విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ ఏఈ శివకుమార్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 409.50 మీటర్లకు ప్రస్తు తం 408.50 మీటర్ల నీరునిల్వ ఉందని తెలిపారు. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు దిగువ ప్రాంతం నుంచి 650 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుందని తెలిపారు.

పోచారం ప్రాజెక్టులోకి కొత్త నీరు

● 6.5 అడుగులకు చేరిన నీటిమట్టం

నాగిరెడ్డిపేట, జూలై22: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పోచారం ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం వరకు పోచారం ప్రాజెక్టులోకి కొత్త నీరు రాకపోగా, పోచారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన మంచిప్ప అడవుల్లో, లింగంపేట, గాంధారి, తాడ్వాయి, రాజంపేట్ తదితర మండలాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా లింగంపేట, గుండారం వాగుల ద్వారా సోమవారం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. పోచారం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీలో స్టోర్ ఉండగా.. ప్రస్తుతం సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 6.5 అడుగుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.820 టీఎంసీలకు గాను ప్రస్తుతం 0.257 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టులోకి సోమవారం మధ్యాహ్నం 6732 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా సాయంత్రానికి ఇన్ ఫ్లో 2767 క్యూసెక్కులకు తగ్గిందని ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు.



పోచారం ప్రాజెక్టులో 6.5 అడుగులకు నీటిమట్టం



లింగంపేట పెద్దవాగు ద్వారా ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీరు

కాంగ్రెస్ ప్రభుత్వం మాటతప్పితే పోరాటం తప్పదు

● సీఐటీయూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు


ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పెద్దబజార్, జూలై 22: కాంగ్రెస్ ప్రభుత్వం మాటతప్పితే పోరాటం తప్పదని సీఐటీయూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు హెచ్చరించారు. సోమవారం నగరంలోని ధర్నాచౌక్ వద్ద ఆశావర్కర్ల సమస్యలపైన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు 15 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభు త్వం తన మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలు 2024 ఫిబ్రవరి 9న ఆరోగ్య శాఖ కమిషనర్‌కు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కనీస వేతనం 18వేల రూపాయలు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. 2023 సెప్టెంబరు 25 నుంచి అక్టోబర్ 9 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజులు ఆశావర్కర్లు సమ్మె చేశారని అన్నారు. అనంతరం వైద్య అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్, యూనియన్ నాయకులు విజయ, రేణుక, సుకన్య, రమ, లలిత, రేవతి, భూలక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.


ఆస్పత్రిలో పేషెంట్‌తో మాట్లాడుతున్న బృందం సభ్యులు

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ఢిల్లీ బృందం

పెద్దబజార్, జూలై 22: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఢిల్లీ నుంచి నలుగురు సభ్యులతో కూడిన బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా ప్రతీ విభాగాన్ని తనిఖీ చేస్తూ ఇన్ఫెక్షన్ వ్యాపించకుండా తీసుకుంటున్న జాగ్రత్తల గురించి సానిటేషన్ వర్కర్లను, పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్‌తో టీబీ వార్డు, ల్యాబ్, బ్రోంబస్కోప్, ఓపీ విభాగాల వద్ద ఎయిర్‌బోన్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ మార్గదర్శకాల ప్రకారం పాటించాల్సిన పద్ధతుల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్, బృందం వైద్యులు భరత్, పార్థసారథి, జావిద్, ప్రమోద్‌రెడ్డి, హెచ్‌వోడీ డీవీవీ రావు, ఉదయ్‌కృష్ణ, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవిగౌడ్, రమ్య పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో కొనసాగుతున్న తనిఖీలు


గోదామును పరిశీలిస్తున్న సివిల్ సప్లయిస్ అధికారులు

బోధన్‌రూరల్, జూలై 22: మండలంలోని మినార్‌పల్లి ఎక్స్‌రోడ్డు సమీపంలో గల గోదాములలో సోమవారం జిల్లా సివిల్ సప్లై డీఎం వైపీ.రమేష్‌తో కూడిన బృందం తనిఖీలు నిర్వహించింది. సీజన్‌లలో కేటాయించిన ధాన్యం నిల్వలు పరిశీలిస్తున్నామని అధికారి వెల్లడించారు. మూడు రోజుల క్రితం ఈ గోదాంలో తనిఖీ నిర్వహించామని మరోసారి తనిఖీలు నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. గత సీజన్‌లో రైస్ మిల్లుకు కేటాయించిన ధాన్యం నిల్వల రికార్డులను అధికారులు పరిశీలించారు. నిల్వలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే కోణంలో అధికారుల తనిఖీలు కొనసాగాయి. రైస్ మిల్లులు తమకు కేటాయించిన ధాన్యాన్ని సక్రమంగా ఎఫ్‌సీఐకి బియ్యంలో అందించాలని అధికారులు రైస్‌మిల్లు యాజమానులకు సూచించారు. రైస్‌మిల్లులోని నిల్వల నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రుద్రూర్ సీఐ జయేష్ రెడ్డి, డీటీ వినోద్ కుమార్, కోటగిరి తహసీల్దార్ సునీత, సివిల్ సప్లై టెక్నికల్ అసిస్టెంట్ రాజేష్, తదితరులున్నారు.

బీడీ కార్మికులందరికీ ప్రభుత్వం జీవన భృతి కల్పించాలి


ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, జూలై 22: బీడీ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులతో పాటు బీడీలు చేసే ప్రతి మహిళకు ప్రభుత్వం జీవన భృతి చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లేష్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని మహలక్ష్మి ఆలయం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు బీడీ కార్మికులు, మహిళతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బీడీ కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, ఎన్నికలలో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రతి మహిళకు 2500రూపాయల పింఛన్, వృద్ధులకు 4వేల రూపాయల పింఛన్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఇచ్చిన మాట ప్రకారం వాటిని అమలు చేయాలన్నారు. బీడీలు చుట్టే కార్మికులే కాకుండా బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవించే ప్యాకర్లు, ఇతర సిబ్బందికి ఎటువంటి షరతులు లేకుండా జీవన భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు 4016రూపాయల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, ధ్యాకం పోశెట్టి, నాగమణి, గంగామణి, శోభ పాల్గొన్నారు.

'దివ్యాంగులను కించపర్చేలా వ్యాఖ్యలు చేయడం సరికాదు'

బోధన్‌రూరల్, జూలై 22: సమాజంలో దివ్యాంగులను కించపర్చేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. సోమవారం బోధన్ ఏసీపీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీనియర్ అధికారిగా కొనసాగుతున్న ఐఏఎస్ స్మితాసబర్వాల్ ఓ సోషల్ మీడియాలో దివ్యాంగులను అవమానపర్చేలా వ్యాఖ్యలు చేశారని ఆమె ఆరోపించారు. దివ్యాంగులు విమానాలు, శస్త్ర చికిత్సలు సరైన పద్ధతిలో చేయగలరా తగు సామర్థ్యాలు లేని వారిని ఆలిండియా సర్వీస్‌లలో ఎలా తీసుకుంటారని అవమానకర పదజాలంతో కించపర్చే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. దివ్యాంగుల రిజర్వేషన్ గురించి మాట్లాడడమంటే భారత రాజ్యాంగాన్ని కించపర్చినట్లు అని ఆమె పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మాట్లాడిన వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

పంట పొలాల పరిశీలన



టాక్లీ శివారులో పంట పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కోటగిరి,జూలై22: గత వారం రోజుల నుండి కురుస్తున్న వర్షాలతో ఆరుతడి, వరిపంటలపై తీవ్ర ప్రభావం చూపుతుండడంతో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్తలు తగిన సలహాలు, సూచనలు అందజేశారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని టాక్లీ, సోంపూర్, దోమలెడ్గి, ఎత్తొండ గ్రామాలలోని వ్యవసాయ పంటలను సోమవారం ప్రాంతీయ చెరకు, వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు క్షేత్ర సందర్శన చేశారు. సోయ, చిక్కుడులో నీరు నిల్వ ఉండడాన్ని గమనించారు. సోయా పంట లేత పసుపు వర్ణంలోకి మారినట్లుగా గుర్తించారు. సోయా పంటలో నీటిని బయటకు తీసివేయాలని రైతులకు సూచించారు. 191919ఎరువును 10గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు, శాస్త్రవేత్తలు నరేందర్, కృష్ణ చైతన్య, దినేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి'

రెంజల్,జూలై22: ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం రెంజల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సాయన్నతో కలిసి వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా వారిపైనే ఉందని, జీవకోటి మనుగడకు మొక్కలు ఎంతగానో ఉపయోగపడతాయని, మొక్కలు లేకపోతే మానవ మనుగడ లేదని అన్నారు. నేడు నాటిన మొక్కలే రేపు మహ వృక్షాలుగా మారి అందరికి ప్రాణవాయువుగా ఉపయోగపడుతుందన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాసజేందర్ రావు, ఏపీవో రమణ, ఫీల్డ్ అసిస్టెంట్ శోభన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పునాది దశలోనే నిలిచిపోయిన మార్కెట్ నిర్మాణం

● నిధుల కొరత వల్లే పనుల్లో జాప్యం

ఆర్మూర్‌రూరల్, జూలై22: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ప్రధాన రహదారి పక్కనే నిర్మిస్తున్న వెజ్ అండ్ నాన్ వెజ్ (సమీకృత) మార్కెట్ పునాది దశలోనే నిలిచిపోయింది. అన్ని హంగులతో అందరికి సౌకర్యంగా మార్కెట్ నిర్మించాలన్న ఉద్దేశంతో అప్పటి ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి రూ.7 కోట్ల 20లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. అనంతరం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పెర్కిట్ లోని 44, 63వ జాతీయ రహదారి కూడలి పక్కన ఇరుకు స్థలంలో మార్కెట్ నిర్మిస్తున్నారు.ఈమార్కెట్‌ను తరలించి అన్ని హంగులతో నూతన మార్కెట్ నిర్మించా లని ఆర్ అండ్‌బీ కార్యాలయ స్థలంలో పనులు ప్రారంభించారు.

● ఆదాయం ఉన్నా వసతులు కరువు

పెర్కిట్‌లోని ప్రస్తుతం బస్టాండ్ సమీపంలో అంతర్గత రోడ్డుకు ఇరువైపులా ప్రతీరోజు కూరగాయల మార్కెట్ నిర్వహిస్తున్నారు. ఆర్మూర్ ప్రాంతంలోని వివిధ మండలాలతో పాటు వివిధ గ్రామాల రైతులు, నిర్మల్ జిల్లా రైతులు సైతం తాము పండించిన కూరగాయలను పెర్కిట్ మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. దూర ప్రాంతం నుంచి కూరగాయలు తీసుకువచ్చే విక్రయించినట్టు విక్రయదారులతో పాటు వినియోగదారులతో మార్కెట్ నిత్యం రద్దీగా ఉంటుంది. పేరుకు పెద్ద మార్కెట్ అయిన వసతులు కరువై ప్రజలు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. మార్కెట్‌లో ప్రజలు, వినియోగదారులు ఎండకు, వానకు ఇబ్బందులుపడాల్సిందే తప్ప షెడ్ల నిర్మాణం లేకపోవడంతో అసౌకర్యంగా మారింది. దీంతో గత పాలకులు మార్కెట్‌ను తరలించి అన్ని హంగులతో వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చి నిధులు మంజూరు చేయించారు. ప్రారంభమైన పనులు మాత్రం పిల్లర్ల దశలోనే ఆగిపోయాయి. ఆర్మూర్ మున్సిపాలిటీకి మార్కెట్ వల్ల ఆదాయం వస్తున్న కనీస సౌకర్యాలు మాత్రం కల్పించడంలేదని విమర్శలు వస్తున్నాయి. మామిడిపల్లి గ్రామపంచాయతీ వద్ద పెర్కిట్‌లో రెండు చోట్ల మార్కెట్‌ను నిర్వహిస్తున్నారు. మార్కెట్‌ల నిర్వహణ ద్వారా మున్సిపాలిటీకి లక్షల్లో ఆదాయం సమకూరు తుంది. గత నెలలో ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో లైబజర్ వేలం నిర్వహించగా తొమ్మిది నెలల కాలానికి రూ.22.86లక్షలకు గుత్తేదారు తక్కించుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న వెజ్ అండ్ నాన్‌వెజ్ (సమీకృత) మార్కెట్‌ను తొందరగా నిర్మించి తమ సమస్యలను దూరం చేయాలని విక్రయ వినియోదారులు కోరుతున్నారు.



పెర్కిట్‌లో పిల్లర్ల దశలోనే నిలిచిన మార్కెట్ పనులు

నిధుల కొరత వల్లే పనులు నిలిచిపోయాయి

పెర్కిట్‌లో వెజ్ అండ్ నాన్ వెజ్ సమీకృత మార్కెట్ భవనం నిర్మిస్తున్న గుత్తేదారుకు డబ్బులు రాకపోవడంతో పనులు నిలిచిపో యాయి. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి మార్కెట్ నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- రాజు, మున్సిపల్ కమిషనర్

కేజీబీవీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతి



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన పీడీఎస్‌యూ నాయకులు

ఆర్మూర్‌రూరల్,జూలై22:ఆర్మూర్‌మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో కస్తూర్బా బాలికల పాఠశాలలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.నరేందర్ మాట్లాడుతూ కేజీబీవీలో సుమారు 400మందికి విద్యార్థినులకు విద్యనభ్యాసిస్తున్నారని వారికి అన్ని వసతులు కల్పించాలన్నారు. వర్షకాలంలో పాఠశాల ప్రాంగణం బురదమయమై మరోవైపు నీరు నిలిచి ఉంటుందని గతంలో ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు.పాఠశాల ఆవరణలో పరిసరాలను పరిశుభ్రం చేయాలని,దోమలు వ్యాప్తి చెందకుండా అన్నిచర్యలు తీసుకోవాలని వారు కోరారు. సమస్యను పరిష్కరించని పక్షంలో ఆందోళన చేపతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ప్రధానకార్యదర్శి నిఖిల్, జంపన్న, బార్గవ్, నిఖిల్, అఖిల్, శ్రీకాంత్, ముకేష్, రాజా, శివ, గంగప్రసాద్‌లు పాల్గొన్నారు.

డిగ్రీ వన్‌టైం పరీక్షల్లో ఒకరు గైర్హాజరు

డిచ్‌పల్లి,జూలై 22: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ బ్యాక్‌లాగ్ వన్‌టైం పరీక్షలు సోమవారం 20వరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు.అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు ముగ్గురు విద్యార్థులకు గాను ముగ్గురు హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 22మంది విద్యార్థులకు గాను 21 పరీక్షకు హాజరయ్యారని, ఒకరు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

పొతంగల్‌లో ఇసుక డంప్ సీజ్

కోటగిరి,జూలై22: పొతంగల్ మండలంలోని మంజీర వాగు సమీపంలో సోమవారం 12ట్రిప్పుల ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. మంజీర వాగు సమీపంలో వీరభద్ర గుడి వద్ద ఇసుక డంప్ ఉన్నట్లు తమకు సమాచారం అందడంతో సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. త్వరలోనే ఇసుక డంప్‌కు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇసుకను డంప్ చేసిన, అక్రమ రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

పీజీ ఇంటిగ్రేటెడ్ బ్యాక్‌లాగ్ పరీక్షల తేదీలు విడుదల

డిచ్‌పల్లి, జూలై 22: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ ఇంటిగ్రేటెడ్ కోర్సుకు చెందిన బ్యాక్‌లగ్ పరీక్షల కు చెందిన షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని సీవోఈ ప్రొ.అరుణ తెలిపారు.ఎంఏ,ఎంకాం, ఎంఎస్ డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, 5ఏళ్ల ఇంటిగ్రేటెడ్ ఏపీఈ, ఐపీసీ హెచ్, ఐఎంబీఏ, 1,3,4,7,9 వసెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షలు జూలై 31నుంచి ప్రారంభమై ఆగస్టు 14వరకు జరుగుతాయని సీవోఈ అరుణ తెలిపారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించలన్నారు.

అమ్దాపూర్‌లో అదనపు తరగతులను నిర్మించాలి

బోధన్‌రూరల్,జూలై22: బోధన్ మండలంలోని అమ్దాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అదనపు తరగతులను నిర్మించాలని గ్రామస్థులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయ భవన నిర్మాణం అర్థంతరంగా ఆగిపోవడం జరిగిందని తక్షణమే పనులు మొదలు పెట్టాలని కలెక్టర్‌ను కోరారు. హాస్టల్‌లో విద్యార్థినులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు సిర్ప సుదర్శన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నవీపేట,జూలై22: మండలంలోని మోకన్‌పల్లి పంచాయతీ పరిధిలోని అంజుమాన్ ఫారంలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమా మహేశ్వర్ రావు, రామకృష్ణ, కాంత్, కే.వెంకటేశ్వర్ రావు, భద్రి, నర్సాగౌడ్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని వినతి

మోస్రా,జూలై22: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తాం అని కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 6నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం సిగ్గు చేటు బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి అని ఈ రోజు బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మోస్రా మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్ కార్యాలయంలో గిర్దావర్ ప్రకాష్‌కు మెమోరాండం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సంగా అనిల్, మండల ప్రధాన కార్యదర్శి కోమిరి సాయిలు, మాజీ ఉప సర్పంచ్ సుదర్శన్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మండల కార్యదర్శి హనుమాగౌడ్, యోగి, శ్రీను, భరత్ గౌడ్, పాల్గొన్నారు.

వర్ని: రాష్ట్రంలో 23శాతంగా ఉన్న బీసీ డిక్లరేషన్ రిజర్వేషన్‌ను 42 శాతంగా అమలు చేయాలని రాష్ట్ర ఓబీసీ మోర్చ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వర్ని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి బీసీలను విస్మరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గొల్ల కుర్మలకు లక్ష రూపాయలు రుణం ఇస్తామని హామీ ఇచ్చి ఆ మాటనే మర్చారని విమర్శించారు. ఎంబీసీ కులాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొరబాబు, మండల శాఖ అధ్యక్షులు శంకర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గంగాదర్, రాజు పాల్గొన్నారు.



కోటగిరిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నవీపేట: రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ సోమవారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు సరిన్, వంశీ మోహన్, శ్రీనివాస్‌గౌడ్, గణేష్, రాము, ఆనంద్, రాజేందర్‌గౌడ్, రాజశేఖర్, రాధ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయడంలో కాలయాపన చేయడంపై ఓబీసీ యువమోర్చా నియోజకవర్గ నాయకులు నాగం సాయిలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ డిక్లరేషన్ కాలయాపనను నిరసిస్తూ కోటగిరి, పొతంగల్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: ఎన్నికల సమయంలో కామరెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని కోరుతూ సిరికొండలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు తహసీల్దార్ రవీందర్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి,కిసాన్‌మోర్చ మండల అధ్యక్షుడు బాబురావు,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు శంకర్, మాలోత్‌రాజేందర్,ఎస్. గోపి, సాయగౌడ్,మారుతీ,అజయ్,కిరన్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్:పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ గజానన్‌కు మెమోరాండం అందజేశారు. ఈసందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు యామాద్రిభాస్కర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల ప్రకారం బీసీలకు కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్‌లు కల్పించాలని, గొల్లకుర్మలకు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో లబ్దిదారులకు గొర్రెల పంపిణీకి సంబంధించి రూ.2లక్షలు వారి అకౌంట్‌లో జమ చేయాలని, బీసీ సబ్‌ప్లాన్‌కు తగిన నిధులు మంజూరు చేయాలని, ఎంబీసీ కులాలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధానకార్యదర్శి జీవీ.నర్సిం హరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధులు కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్; బాశెట్టి రాజ్‌కుమార్, ఆకుల శ్రీనివాస్, పొల్కం వేణు, పులి యుగంధర్, కేసీ ముత్తెన్న, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో కామారెడ్డిలో ఇచ్చిన హామీ మేరకు బీసీ గణన చేపట్టాలని ముప్కాల్ మండల కేంద్రంలో బీజేపీ ఓబీసీ మోర్చ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బీసీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి,నర్సయ్య,కెఎంరెడ్డి,గంగాధర్,దినేష్,సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి : ఎస్సై

డొంకేశ్వర్, జూలై22 : సైబర్‌నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండి స్మార్ట్ ఫోన్‌లో తెలియని లింకులు ఓపెన్ చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై రాహుల్ అన్నారు. సోమవారం డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి, గంగాసరం గ్రామాలలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత వివరాలకు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. బ్యాంకు లోగోలతో వచ్చిన లింకులను యాప్స్‌ను ఓపెన్ చేయకూడదని కోరారు. సైబర్ నేరాలు గురైనప్పుడు 1930నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. సైబర్ క్రైం గురైన వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. స్మార్ట్ ఫోన్‌లో లింకులు క్లిక్ చేయకుండా జాగ్రత్త ఉన్నట్లయితే సైబర్ నేరాల జరుగకుండా అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ రాములు, రాజేశ్వర్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

ముప్కాల్, జూలై22: బాల్కొండ, ముప్కాల్ మండలాల్లోని అన్ని గ్రామాల రైతులు ఈ సంవత్సరం నూతనంగా పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతులు, ఇది వరకు రైతు బీమా చేసుకొని రైతులు రైతు బీమాకు సంబంధించి దరఖాస్తులు వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారులు మహేందర్, రాజ్‌కుమార్ తెలిపారు. 18 నుంచి 59ఏళ్ల ఉండి అర్హత కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత సంవత్సరం ఆగస్టు నుంచి ఈ సంవత్సరం జూన్ 28వ తేదీ వరకు కొత్తపాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా దరఖాస్తు చేసుకోవాలని, గతంలో పట్టాపాస్‌బుక్ పొంది ఇంత వరకు బీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు నామిని వివరాలు ఏమైనా మార్చుకోవాలన్నా ఏఈవోను కలిసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతుబీమా దరఖాస్తు కోసం బీమా అప్లికేషన్ ఫాం, పట్టాపాస్‌బుక్ జిరాక్స్, రైతు ఆధార్‌కార్డు జిరాక్స్, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌లో జత చేయాల్సి ఉంటుందని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ముప్కాల్, జూలై 22: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ సీహెచ్. మురళీ తెలిపారు. సోమవారం బాల్కొండ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పిల్లలకు ప్రస్తుతం వర్షాకాలం సీజనల్ వ్యాధులైన మలేరియా, డయేరియా, కలర, డెంగ్యు వంటి వ్యాధులు రాకుండా చేపట్టేచర్యలను వారికి వివరించారు. పాఠశాలలో మధ్యాహ్నభోజన పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు చేతులు కడిగే పద్ధతి గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో రాజు, సుజాత, ఎఎన్ఎంలు, ఆశవర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని వినతి

ఆర్మూర్‌రూరల్, జులై 22 : బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం ఆలూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్‌కు బీజేపీ శ్రేణులు వినతిపత్రం అందజేశాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు బండారి యాదగిరి మాట్లాడుతూ కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, దానిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నాడిశరం మల్లయ్య, మండల అధ్యక్షుడు కొత్తూరు గంగాధర్, ఉపాధ్యక్షుడు రమేష్, ప్రశయ్‌తేజ్, లోక రాంరెడ్డి, సురేష్‌గౌడ్, హరిష్, నాగేంధర్, శ్రీకాంత్, నరేష్, ప్రణీత్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

డిచ్‌పల్లి,జూలై 22: మండలంలోని ధర్మారం (బీ) వేంకటేశ్వర ఆలయంలో సోమవారం శ్రావణ నక్షత్రం సందర్భంగా శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణ కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. స్వామి వారికి పట్టువస్త్రాలు తలంబ్రాలు, రావుల బ్రహ్మానందం దంపతులు సమర్పించారు. కల్యాణోత్సవ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆశాఢ మాసంలో స్వామి వారి కృప అందరికి కలగలని ప్రతి యేటా కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వర్గీకరణ సాధన కోసం ఛలో ఢిల్లీకి తరలిరావాలి

● ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు రమేష్‌కుమార్

సుభాష్‌నగర్, జూలై 22: వర్గీకరణ సాధన కోసం మాదిగలందరూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించతలపెట్టిన ధర్నా కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలిరావాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనతోనే మాదిగలకు వారి ఉప కులాలకు అన్ని విధాల న్యాయం జరుగుతుందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే వందరోజుల్లో వర్గీకరణ బిల్లు పెడతామని హామీలు ఇచ్చారని హామీలు నీటిమూటలు గానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీవర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 10, 11 తేదీల్లో జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి తరలిరావాలన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

'పోడు' సమస్యలపై శాసనసభలో చర్చించాలి'

● పోడుభూముల సాధన కమిటీ

బోధన్‌రూరల్, జూలై 22 : పోడు రైతుల సమస్యలపై శాసనసభలో చర్చించాలని పోడుభూముల సాధన కమిటీ సభ్యులు సోమవారం బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాధన కమిటీ నాయకులు నన్నేసాబ్ మాట్లాడుతూ బోధన్ డివిజన్‌లోని చందూర్ తదితర మండలాల్లోని గ్రామాలలో గిరిజనేతర నిరుపేద రైతులు గత 30 సంవత్సరాలుగా పోడుభూములు సాగు చేసుకుని జీవిస్తున్నారని, అర్హులైన నిరుపేద పోడు రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం గిరిజనులకు పట్టాలు ఇచ్చి గిరిజనేతరులకు మొండి చేయి చూయించిందని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి పోడు భూములకు పట్టాలు ఇస్తామని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. శాసన సభ సమావేశాల్లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పోడు రైతుల సమస్యలపై గళం ఎత్తాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు సాయిబాబా, వెంకన్న, సాయిలు, శ్రీను, సాయి, గంగారాం తదితరులున్నారు.

మున్సిపల్ కార్మికులకు షూస్ పంపిణీ

ఆర్మూర్‌టౌన్, జూలై 22: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్‌చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ సోమవారం కార్మికులకు బ్లౌజెస్, షూస్‌లు పంపిణీ చేశారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా కార్మికుల సందర్భనార్థం ఆప్రన్స్ బ్లౌజెస్, షూస్ పంపిణీ చేసినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ షేక్‌మున్న, మున్సిపల్ కమిషనర్ రాజు, డీఈ భూమేశ్వర్, కౌన్సిలర్ ఆకుల రాము, తదితరులు పాల్గొన్నారు.

బీమాకు దరఖాస్తులు చేసుకోండి

● కమ్మర్‌పల్లి మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌మాలిక్

కమ్మర్‌పల్లి, జూలై 22 : జూన్ 28 వరకు నూతనంగా పట్టేదార్ పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని కమ్మర్‌పల్లి మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌మలిక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతు గతంలో రైతు బీమా చేయించుకున్న రైతులు తప్పొప్పులను మార్పుటు చేర్పులను సరిచేయించుకోవడానికి ఈనెలాఖరువరకు అవకాశం ఉందన్నారు. నూతనంగా పట్టేదార్ పాసుపుస్తకం పొందిన రైతులు దరకాస్తు ఫారం, రైతుల పట్టేదార్ పాసుపుస్తకం లేదా తహసీల్దార్‌తో డిజిటల్ సంతకంతో డీఎస్‌అర్ పేపర్, రైతు ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు అందజేయాలన్నారు. 14 ఆగస్టు 1965 నుంచి 14 ఆగస్టు 2006 మధ్య పుట్టిన రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఆధార్ కార్డులో 18 సంవత్సరాలు నుండి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులు మాత్రమే రైతుబంధుకు దరకాస్తులు చేసుకోవాలన్నారు. తమ దరకాస్తులను తమతమ గ్రామాలకు చెందిన వ్యవసాయవిస్తీరణ అధికారులు (ఏఈవోలకు) అందజేయాలని అన్నారు.

భారీ వర్షానికి దెబ్బతిన్న నాలుగు ఇళ్లు

నవీపేట, జూలై22 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో నాలుగు ఇళ్లు దెబ్బతిన్నాయని తహసీల్దార్ నారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని దర్యాపూర్‌లో రెండు, నవీపేటలో ఒకటి, ఫత్తేనగర్‌లో ఒకటి చొప్పున ఇళ్లు దెబ్బతిన్నాయని అన్నారు. బాధిత కుటుంబాలను ఒక్కొక్కరికి 3200చొప్పున పరిహారాన్ని అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ల ఆయిల్ చోరీ

నవీపేట,జూలై22: మండల కేంద్రంలోని భట్టువాలా బాగ్ సమీపంలో ఆదివారం రాత్రి రెండు ట్రాన్స్‌ఫార్మర్ల ఆయిల్ చోరీకి గురైందని ట్రాన్స్‌కో ఏడీ సుహాసిని తెలిపారు. గుర్తు తెలియని దుండగులు 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుండి 250 లీటర్లు, 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుండి 200లీటర్ల ఆయిల్‌ను ఎత్తుకెళ్లారని ఆమె పేర్కొన్నారు. ఈ చోరీ విషయంపై నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

శివాలయంలో హుండీ లెక్కింపు

బోధన్‌రూరల్, జూలై 22 : బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలోని శివాయలంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించగా 1,09,421 భక్తుల ద్వారా హుండీలో లభించినట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రాములు, వేద పండితులు గణేష్ మహరాజ్, ఈవో రవీందర్ గుప్తా, కన్యాక పరమేశ్వరి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మారుతీ మందిరంలో ..

బోధన్‌రూరల్,జూలై 22 : మారుతీ మందిరంలో సోమవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. హుండీ లెక్కింపులో 31,585రూపాయల ఆదాయం భక్తుల ద్వారా లభించినట్లు దేవాదాయ శాఖ అధికారి కమల తెలిపారు. మూడునెలల నుంచి హుండీని సోమవారం తెరిచి లెక్కించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేద పండితులు ప్రవీణ్ మహరాజ్, దేవాదాయ శాఖ ఈవో రవీందర్ గుప్తా, జూనియర్ అసిస్టెంట్ రాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సునీల్‌కుమార్

కమ్మర్‌పల్లి, జూలై 22: మండంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన సాగర్ తండ్రి నాగన్న ఇటీవల అనారోగ్యంతో మరుణించడంతో ఆయన కుటుంబాన్ని బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ బుధవారం పరామర్శించి మృతుని కుటుంబసభ్యులకు సంతా పం తెలిపారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు సుంకెట బుచ్చన్న, స్కూరి విజయ్, సిడిసి మాజీ చైర్మన్ కొమ్ముల రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

దారిదోపిడీ కేసులో ముగ్గురికి జైలు

నిజామాబాద్ లీగల్, జూలై 22 : దారి దోపిడీ కేసులో నందిపేట్ మండలానికి చెందిన గుగులోత్ పీర్యా, సుంకరి మహేష్, మూడ్ రాజేష్‌లకు మూడుసంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ అదనపు సహాయక సెషన్స్ జడ్జి శ్రీకాంత్‌బాబు సోమవారం తీర్పుచెప్పారు. 15 డిసెంబర్ 2018న పాల్దా గ్రామానికి చెందిన బూస సౌజన్య తన భర్త రాజు, బంధువు నిర్మలతో బంధువుల వివాహానికి వెళ్లి తిరిగి వస్తూ పోతంగల్ పాల్దా దగ్గర సాయంత్రం ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి వారి మెడలోంచి పుస్తెలతాడు నల్ల పూసాలదండను తెంపుకొని పరారీ అయ్యారు. పారిపోతున్న ఇద్దరిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మూడవ వ్యక్తిని సైతం పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపర్చగా పోలీసువారి తరఫున పీపీ లక్ష్మీనర్సయ్య సాక్షాదారాలను రుజువు పర్చగా నింధితులపై అభియోగం రుజువు కావడంతో వారికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఒక్కోక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధించి తీర్పు చెప్పారు

చంద్రశేఖర్ ఆశయాలకు పునరంకితమవుదాం

● సీపీఐఎంఎల్ మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి

ధర్పల్లి, జూలై 22 : విప్లవ యోధుడు రాయల చంద్రశేఖర్ ఆశయ సాధన కోసం పునరంకితం అవుదామని సీపీఐఎంఎల్ మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ కేంద్ర, రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గసభ్యులు రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభను నిర్వహించారు. ధర్పల్లి, సిరికొండ మండలాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంస్మరణ సభలో చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రశేఖర్ ఆశయసాధనకు కృషి చేద్దామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దామోదర్, బాబన్న, సాయిరెడ్డి, లింబాద్రి, రమేష్, కిశోర్, ఆశీష్, ఆశన్న, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్ : విప్లవ పోరాట యోధుడు రాయల చంద్రశేఖర్ ఆశయాలు కొనసాగిద్దామని మాస్‌లైన్ ప్రజాపంథ డివిజన్ నాయకులు ఎస్.సురేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రజాపంథ కేంద్ర నాయకులు, రాష్ట్ర కార్యదర్శి, వర్గసభ్యులు రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభను నిర్వహించారు. ఆయన మరణం పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం డివిజన్‌నాయకులు సురేష్ సత్తెవ్వ, అశోక్, జి.కిషన్, దయాల్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాయల చంద్రశేఖర్ సేవలను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్‌లు, రాజేశ్వరి, నర్సయ్య, పోశన్న, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న కార్యదర్శికి సన్మానం

సిరికొండ జులై 22 : సిరికొండ నుంచి బదిలీపై వెళుతున్న పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌కు సోమవారం యువకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువకులు శివకుమార్ గురించి ప్రసంగించారు. గత ఏడాది కాలంగా సిరికొండలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న శివకుమార్ అందరి మన్ననలు పొందారు. గ్రామ ప్రజలతో కలుపుగోలుగా ఉంటూ గ్రామంలో ఎవరు ఏ సమస్య చెప్పినా వారికి సంతృప్తికరమైన సమాధానం చెప్పి సమస్య పరిష్కారం కోసం పనిచేశారని యువకులు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కె.సతీష్, మోర్తాడ్ నగేష్,డి.బాబురావు, ప్రేమ్‌కుమార్, సిదురు గంగాధర్, మారుతి, ఎస్.గోపి, కిషన్ తదితరులు ఉన్నారు.

'శిక్షణా తరగతులను వినియోగించుకోవాలి'

ఆర్మూర్‌రూరల్, జులై 22 : శిక్షణా తరగతులలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జీ సీడీపీవో ఆర్.జ్యోతి అన్నారు. సోమవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఐసీడీఎస్ కార్యాలయంలో మూడురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు మంచి వాతావరణం కల్పించి చదువు నేర్పించాలన్నారు. దీని ద్వారా మెదడులో నాడీకణాలు వృద్ధి చెందుతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చార్ట్‌లు ఆకర్షణీయంగా ఉంచాలని, కేంద్రాలలో ప్రీ స్కూల్ నమోదు శాతం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ రేఖ, శ్రీదేవి, రాంబాబు, విలాస్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు'



బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

పెద్దకొడప్‌గల్, జూలై 22 : ప్రభుత్వ ఉద్యోగం చేసే వారు ఏ స్థాయిలో ఉన్నా పనిచేసే చోట ఉత్తమ సేవలు అందిస్తే అటువంటి వారిని ఆ ప్రాంతం వారు మర్చిపోరని పెద్ద కొడప్‌గల్ ఉన్నత పాఠశాల ప్రదానోపా ధ్యాయురాలు కమల తెలిపారు. సోమవారం పాఠశాల నుంచి ఇటీవలే పదోన్నతి పొంది బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రదానోపా ధ్యాయురాలు కమల మాట్లాడుతూ ఉపాధ్యాయులు తాము పనిచేసే చోట అంకితభావంతో పనిచేస్తే ఆ ఉపాధ్యాయుడిని విద్యార్థి తన జీవి తంలో ఎన్నడూ మర్చిపోరని తెలిపారు. అనంతరం పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు చంద్రకాంత్, కిషన్, శశికాంత్, పయాజ్, రాకేష్ లకు సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది కిషో ర్‌సింగ్, సుదర్శన్ రెడ్డి, నాగనాథ్, ఉమ, మల్లేష్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న ఇళ్లకు నోటీసులు



ఇంటి యజమానులకు నోటీసులు అందిస్తున్న మున్సిపల్ అధికారులు

కామారెడ్డిటౌన్, జూలై 22 : వర్షాల కారణంగా కామారెడ్డిలోని పలు ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి మున్సిపల్ అధికారులు నోటీసులు అందించారు. శిథిలావస్థలో ఉండి కూలడానికి సిద్ధంగా ఉన్న ఇండ్ల కారణంగా పక్కనున్న ఇండ్లపై పడి ఇరుగుపొరుగు వారికి ప్రాణ, ఆస్తినష్టం జరిగే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లను వెంటనే నేలమట్టం చేసి చదును చేసుకోవాలని యజమా నులకు సూచించారు.

'ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రసాద్

గాంధారి, జూలై 22 : కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరుగ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం పార్టీ రాష్ట్రకమిటీ సభ్యుడు ప్రసాద్ అన్నారు. సోమవారం గాంధారి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీ లను సత్వరమే అమలు చేయాలని సీపీఐ(ఎ) డిమాండ్ చేస్తుం దన్నారు. వ్యవసాయ కూలీలు, మహిళలకు ఆర్థిక సహాయం చేయాలని రైతులకు ఈ వాన కాలం నుంచి రైతుభరోసా అమలు చేయాలని, పంటల బీమా పథకాన్ని రైతాంగానికి ఉపయోగపడే విధంగా బీమా ప్రీమియం ప్రభుత్వం భరించి అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వెం కట్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు మోతిరాంనాయక్, చంద్రశేఖర్, సురేష్, నర్సింలు, అజయ్, ప్రకాష్, కిషన్‌రావు పాల్గొన్నారు.

ఏఈ లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళన

ఎల్లారెడ్డి, జూలై 22 : మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన రైతు రవి శుక్రవారం విద్యుత్‌షాక్‌తో మృతికి కారణమైన ఏఈ సత్యనా రాయణ, లైన్‌మెన్ కాశీరాంపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కుటుంబ సభ్యులు గ్రామస్తులు డిమాండ్ చేస్తూ సోమవారం సాయంత్రం అజా మాబాద్ సబ్‌స్టేషన్ ముందు కరెంట్ సప్లై నిలిపివేసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నాసాగర్ గ్రామ శివారులో 11 కేవీ విద్యుత్ తీగలు కిందకి వేలాడుతున్నాయని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతోనే రవి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి గ్రామస్తులకు నచ్చజెప్పడంతో విరమించారు.

దోమకొండలో జాతర

దోమకొండ, జూలై 22 : మండల కేంద్రంలోని చాముండేశ్వరీ దేవి ఆల యం ఆవరణలో సోమవారం ఘనంగా జాతర కొనసాగింది. దోమకొండ, బీ బీపేట, భిక్కనూర్, మాచారెడ్డి, పాల్వంచ మండలాల భక్తులతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన బంధువులు జాతరలో పాల్గొన్నారు. అమ్మవారి బోనా ల పండగ సందర్భంగా సాయంత్రం తీర్థప్రసాద వితరణ చేశారు. అమ్మవారి చీరల వేలం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీసీలకు ఇస్తానన్న హామీలను నెరవేర్చాలి

మాచారెడ్డి, జూన్ 22 : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇస్తానన్న హామీ లను వెంటనే నెరవేర్చాలని ఓబీసీ మెర్చా అధ్యక్షుడు బాలచంద్రం అన్నా రు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రెటరి వడ్ల నరసిం హచారి, జిల్లా మహిళా మోర్చా జనరల్ సెక్రెటరి హారిక, మండల అధ్య క్షుడు భూససురేష్, ఓబీసీ జనరల్ సెక్రెటరీ ప్రవీణ్‌గౌడ్, భాస్కర్‌చారి, స్వామిగౌడ్, సీనియర్ నాయకులు గంగారాం, నర్సింలు, రవి, భరత్‌యా దవ్, క్రాంతికిషన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను ప్రభుత్వం అమలు చేయాలి

- బీజేపీ నాయకుల డిమాండ్
- మండలాల్లో ధర్నాలు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ టౌన్, జూలై 22 : ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా నా యకులు డిమాండ్ చేశారు. సోమ వారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వ ర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకు లు మాట్లాడుతూ అన్ని బీసీ కులాల కు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుడుగుట్ల శ్రీనివాస్, చిదుర సా యిలు, అశ్విన్ పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్ల రేషన్ వెంటనే అమలు చేయాలని రాష్ట్ర అధి కార ప్రతినిధి కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మాదాస్వామి యాదవ్అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ నరసిం హారెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్ర మంలో జిల్లా సెక్రెటరీ రాజలింగం, రమేష్ రావు, పట్టణ ఓబీసీ అధ్యక్షుడు ఉప్పు లక్ష్మీ పతి, జనరల్ సెక్రెటరీ నిట్టురఘు, రూర ల్ ఓబీసీ అధ్యక్షుడు నర్సింలు, పట్టణ ఉపా ధ్యక్షుడు చిరంజీవి, మహేందర్ పాల్గొన్నారు.

దోమకొండ : మండల కేంద్రంలోని త హసీల్దార్ కార్యాలయంలో సోమవారం బీజే పీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ సంజీవ్‌రావ్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కుంట లక్ష్మారెడ్డి, మహేందర్‌గౌడ్, అబ్రబోయిన సిద్ధరాములు, మద్దూరి భూపాల్‌రెడ్డి, జగదీష్, మనోజ్, ర వీందర్‌రెడ్డి, చింతల రాజేష్, పాతూరి రవి, రవి, నర్సింలు, రాము పాల్గొన్నారు.

బీబీపేట : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెర వేర్చాలని బీజేపీ ఓబీసీ మండల అధ్యక్షుడు మహేందర్ శర్మ అన్నారు. సోమవారం తహ సీల్దార్ శృతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా కార్యదర్శి రవీం దర్, బీజేపీ మండల అధ్యక్షుడు రంజిత్‌గౌడ్, నాయకులు పిడుగుశ్రీనివాస్, భరత్, బట్టు రాజ్, ఉప్పునారాయణ పాల్గొన్నారు.

బీర్కూర్ : సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలని బీజేపీ బీసీ మోర్చ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠా యించి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ లతకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మండల అధ్యక్షులు నాగెళ్ళ సాయికిరణ్, మండల ప్రధాన కార్య దర్శులు శ్రీనివాస్, యోగేష్, హన్మాం డ్లు, రవి, బీరుగొండా, సాయి బాబా, బస్వరాజు, నవీన్, నగేష్, జగదీశ్, విజయ పాల్గొన్నారు.

మద్నూర్ : మండల బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ ముజీబ్‌కు వినతిపత్రం అందజే శారు. ప్రభుత్వంలోకి వచ్చిన ఆరునెలలలోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధా రంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామ న్నారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని హామీనిచ్చారు. నాయకులు సంతోష్, తుకారాం ఉన్నారు.

నసురుల్లాబాద్ : మండలంలోని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మండల శాఖ ఆధ్వర్యం లో నసురుల్లాబాద్ మండల తహసీల్దార్‌కి సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్య క్రమంలో బీజేపీ బాన్సువాడ అసెంబ్లీ కన్వీ నర్ జి.శ్రీనివాస్, కామారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి సీహెచ్ హన్మాండ్లు యాదవ్, మం డల అధ్యక్షులు సున్నం సాయిలు ముదిరాజ్, ఓబీసీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నిండుగా ప్రవహిస్తున్న పెద్దపూల్‌వాగు



బాన్సువాడలో నిండుగా ప్రవహిస్తున్న పెద్దపూల్‌వాగు

బాన్సువాడటౌన్ , జూలై 22 : బాన్సువాడ పట్టణంలో మూడురోజులు గా ఓ మోస్తారు నుంచి భారీవర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా వర్షా లు కురియడంతో ఎగువ నుంచి వరదనీరు చేరి కల్కి చెరువుకు జలకళ సంతరించుకుంది. ఆర్టీసీ డిపో వద్ద గల పెద్దపూల్‌వాగు నిండుగా ప్రవ హిస్తోంది. కాలువలు నిండుగా ప్రవహిస్తున్నాయి. వర్షాలు కురియడంతో భూగర్భజలాలు పెరిగాయని, పంట పొలాలకు అనుకూలంగా ఉంటుం దని ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మెనూ ప్రకారం భోజనం పెట్టాలని వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి, జూలై 22 : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్ట ల్‌లో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని సోమవారం బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు మర్లుసాయి బాబా, లెగ్గిల రాజు, తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్‌లో ఉండే విద్యార్థులు తల్లిదండ్రులు కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

తాత్కాలిక శిబిరాలకు తరలింపు



బాధితులతో మాట్లాడుతున్న జీపీ సెక్రటరీ, విండో చైర్మన్

బీర్కూర్, జూలై 22 : మూడురోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు భారీగా కురుస్తున్నాయి. దీంతో పురాతన ఇళ్ళు కూలుతున్నాయి. శిథి లావస్థకు చేరుకున్న ఇళ్ళు వర్షం దాటికి ఊరిస్తున్నాయి. ఇదిలా ఉండగా బీర్కూర్ మండలం వీరాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ తరఫున తాత్కాలిక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం విండో చైర్మన్ రాంబాబు, జీపీ సెక్రటరీ హరీష్‌లు గ్రామంలో వీధులన్నీ తిరిగారు. పురాతన ఇళ్లను, శిథిలావస్థలో ఉన్న గృహాలను సందర్శిం చి ఇళ్లను పరిశీలించారు. వర్షాల ధాటికి ఇళ్ళు కూలిపోయే ప్రమాదం ఉండడంతో శిబిరానికి వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితుల కోసం శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కురుస్తున్న ఇళ్ళల్లో, పురాతన ఇళ్ళల్లో, శిథిలావస్థకు తరలిస్తున్నారని విండో చైర్మెన్ రాంబాబాబు తెలిపారు. వారికి తిండి, తాగునీరు, విద్యుత్ లాంటి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి హరీష్ కుమార్, మాజీ సర్పంచ్ ఎర్రోళ్ల సాయిరాం తదితరులు ఉన్నారు.

ఆహార పంటల క్షేత్రస్థాయి పరిశీలన



ఆహార పంటలను పరిశీలిస్తున్న అధికారి

మద్నూర్, జూలై 22 : మండలంలోని ఆయా గ్రామా లలో జాతీయ ఆహార భద్రత పథకం జిల్లా వ్యవసా య టెక్నికల్ అసిస్టెంట్ సురేందర్ పెసర, మినుము, పంట లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటలలో ఆశిస్తున్న పురుగులు, తెగుళ్ల గురించి రసాయన మం దుల ఎలా పిచికారి చేయాలని వాటిపై రైతులకు అవ గాహన కల్పించారు. రైతులు తమ పంటలలో ఉన్న సమస్యలు, సల హాల గురించి గ్రామీణ ప్రాం తాలలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు సంప్రదించాలని సూచించారు. ఆయన తోపాటు మండల వ్యవసాయ అధికారి రాజు ఏఈవోలు రైతులు, మాజీ ఎంపీటీసీ గడ్డం లక్ష్మణ్ పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పంట

బీర్కూర్, జూలై 22 : గత మూడు రోజులుగా ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నా యి. దీంతో ప్రజలు బయటకు రాలేక ఇంట్లో ఉండలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఇదిలా ఉండగా బీర్కూర్ మండలం లోని ఆయా గ్రామాల్లో వరి పంటలు వర్షాల ధాటికి నీట మునిగాయి. రాత్రి కురిసిన వర్షానికి గ్రామాల్లో ఆయా గ్రామాల్లో పురా తన ఇళ్ల శిథిలావస్థకు చేరిన ఇళ్ళు నేల కూ లాయి. వాగులు వంకలు నిండుగా పారు తున్నాయి. చెరువుల్లోకి భారిగా వరద నీరు వచ్చి చేరుతోంది. కొన్ని గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్ళల్లో వరద నీరు చేరింది బీర్కూర్‌లో ప్రధాన రహదారి బురద మయంగా మారడంతో ప్రజలు నరక యాతన పడుతున్నారు.



బీర్కూర్ శివారులో నీట మునిగిన వరి పంట

సుందరీకరణ పనుల పరిశీలన

బాన్సువాడటౌన్, జూలై 22 : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధి లోని 17వ వార్డులో ప్రొ.జయశం కర్ విగ్రహ సుందరీకరణ పను లను సోమవారం మున్సిపల్ చై ర్మన్ జంగం గంగాధర్ పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహం చుట్టూ రేయిలింగ్, గ్రానైట్ వేయించడం జరుగుతుందన్నారు. అదే విదం గా పట్టణంలో ప్రజల సౌకర్యా ర్థం సుందరీకరణ పనులు చేప ట్టడం జరుగుతుందన్నారు. కార్య క్రమంలో నాయకులు ఏజాస్, నార్ల రవీందర్‌గుప్త, నార్ల ఉద య్, రమేశ్, రఫీక్, పుండరీకం ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

'గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయండి'



ప్రజావాణికి హాజరైన ఉద్యోగులు

పెద్దకొడప్‌గల్, జూలై 22 : మండలంలోని ఆయా గ్రామాలలో సమస్యలు ఏవైనా అధికారుల దృష్టికి వస్తే వాటిని పరిష్కరించాలని మండల తహ సీల్దార్ దశరథం అధికారులకు పిలుపునిచ్చారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణికి వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దశరథం మాట్లాడుతూ ఈ ప్రజావాణికి ప్రజల నుంచి ఎటువంటి దరఖాస్తులు రాలేదని, అయితే గ్రామాలలో ఏవైనా సమస్యలున్నట్లు అధికారుల దృష్టికి వస్తే పరిష్కరిం చాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్, మం డల వ్యవసాయాధికారి నదీమ్‌ఉద్దీన్ అధికారులు పాల్గొన్నారు.

పోటో రైటప్ 91: విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కస్తూర్బా విద్యార్థినులకు దుస్తుల పంపిణీ



దుస్తులతో విద్యార్థినులు

పెద్దకొడప్‌గల్, జూలై 22 : జుక్కల్ మండలంలోని బస్వాపూర్ గ్రామశివా రులో గల కసూర్బా పాఠశాల విద్యార్థినులకు సోమవారం 2వ విడత కింద దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేక అధికారి అశ్విని మాట్లాడుతూ గతంలోనే విద్యార్థినులకు మొదటి విడత దుస్తులు పంపిణీ చేశామని తెలిపారు. ప్రస్తుతం రెండో విడత కింద పాఠ శాలలో విద్యాభ్యాసం చేస్తున్న నాలుగు వందల విద్యార్థినులకు దుస్తులు పం పిణీ చేస్తున్నామని తెలిపారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ వర కు విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేశామని తెలి పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం సత్యనారాయణ, సీసీలు తుకారాం, రాజశ్రీ, సంజీవ్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో ఉద్యోగుల బదిలీలు



బదిలీపై వెళ్తున్న జూనియర్ అసిస్టెంట్‌లను సన్మానిస్తున్న సబ్ రిజిస్ట్రార్

దోమకొండ, జూలై 22 : మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాల యంలో విధులునిర్వహిస్తున్న ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లు అవేజ్, బా న్సువాడకు బదిలీ కాగా, భరత్ నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. సోమవా రం కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ జబ్బర్, సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు శాలువాతో సన్మానించారు.

సదాశివనగర్ : మండలంలోని ఐదు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు ఎంపీడీవో సతీష్‌కుమార్ తెలిపారు. తిర్మన్‌పల్లి కార్యదర్శి నరేష్ బదిలీ కాగా ఇంతియాజుద్దిన్ కార్యదర్శిగా రావడం జరిగిందన్నారు. కుప్రియల్ నుంచి పి.విజయ బదిలీ కాగా గణేష్ బాధ్య తలు చేపట్టా రన్నారు. జనగాం నుంచి సౌమ్య బదిలీ కాగా సంధ్య బాధ్యతలు చేపట్టారు. లింగంపల్లి నుంచి స్వరూప బదిలీపై వెళ్లగా ప్రకాష్ నూతన కార్యదర్శిగా రావడం జరిగింద న్నారు. ఉత్తనూర్ నుంచి దేవి సింగ్ బదిలీ పైవెళ్లగా రాహుల్‌గౌడ్ కార్యదర్శిగా వచ్చారు.

మాచారెడ్డి : మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సూపరిటెం డెంట్‌గా విధులు నిర్వహించిన సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, అటెం డర్ అర్జు న్‌లు బదిలీ అయ్యారు. వీరికి మాజీ ఎంపీపీ నరసింహా రెడ్డి ఆధ్వర్యం లో ఘనంగా సన్మానించారు. మాచారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధి కారిగా విధులు నిర్వహించిన సతీష్ సుల్తానాబాద్‌కు బదిలీ అయ్యారు. అయనను సైతం సన్మానించారు.

వ్యక్తి అదృశ్యం కేసులో విచారణ

సదాశివనగర్, జూలై 22 : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన మల్లయ్య గత శుక్రవారం నుంచి కనిపించడం లేదు. కొన్నిరోజుల క్రితం మల్లయ్య కొడుకు ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తన కొడుకు ఆత్మహత్య చేసుకోలేదని ముగ్గురు వ్యక్తులు కలిసి హత్య చేసి నట్లు ఆరోపించి వారిని దూషించడంతో ముగ్గురువ్యక్తులు మల్లయ్యపై పగ పెంచుకుని శుక్రవారం నుంచి కనిపించకుండా పోయిన మల్లయ్యను సైతం వారే హత్యచేసినట్లు కుటుంబసభ్యులు పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. ఈ విష యమై పోలీసులు అనుమానిత ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా నిజానిజాలు ఇంకా ధృవీకరించలేదని తెలిపారు.

CLASSIFIEDS

WANTED

అనఘా షాపింగ్ మాల్‌లో పర్మినెంట్‌గా పనిచేయుటకు హెల్పర్స్ (M/F) మరియు అనుభవం గల ఎలక్ట్రీషన్ కావలెను. ఆసక్తి గలవారు వెంటనే I.D. ప్రూఫ్, ఫోటోతో నేరుగా సంప్రదించండి. అనఘా షాపింగ్ మాల్, ఆర్.పి.రోడ్, నిజామాబాద్

AJZ

కమర్షియల్ ప్లాట్లు అమ్మబడును

NZB వీక్లీ మార్కెట్ 2600 గజాలు, NH 44 2200 గజాలు, ధర్మారం 1000 గజాలు, దాస్‌నగర్ నుండి నందిపేట్ 100ft రోడ్డులో 1600 గజాలు, ఖలీల్‌వాడిలో 241, 290 గజాలు సం. 9705656592

AJZ

CHANGE OF NAME

I, NEGA NARSAIAH (OLD NAME) R/O H.NO: 3-101, MOOTAPALLY, RAIKAL, JAGITIAL, TS. I HAVE CHANGED MY SURNAME JAGGA NARSAIAH S/O JAGGA GANGARAM (NEW NAME)

AJZ

పాస్‌పోర్ట్ పోయినది

ముత్యప్ప హెహన్ S/o ముత్యప్ప గంగారం H.NO. 5-61, గ్రా. ఐలర్వాయి, మం. ఐలర్వాయి, జి. నిజామాబాద్ TG, నేను మా ఇంటి నుండి ఐలర్వాయి మండలం పీ సేవక బైక్‌పై వెళ్తుండగా S0707671 నెంబర్ గల పాస్‌పోర్ట్ పోయినది. దొరికినచో సంప్ర. 9346802179

AJZ

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-

కామారెడ్డి : 9985411453

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	ఓసీ
దర్శన్	డార్లింగ్
ప్రియా 70	కల్కి
ప్రియా 35	భారతీయుడు-2

బాన్సువాడ	
మహేశ్వరి	కల్కి
వెంకటేశ్వర	డార్లింగ్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230

